# ఇరువదిఎనిమిదవ ప్రసంగము

రాత్రి భోజనానంతరము తొమ్మిదిగంటలకు స్వామివారి చెంతకు అందరును చేరిరి. అంతట పెద్దవిద్యార్థి ప్రశ్నించెను. "జ్ఞానమును సంపాదించుటకు గురువు అవసరమా? కాదా?

## జ్ఞానమును పొందుటకు గురువు అవసరము.

స్వా. ప్ర. :—శంకరులు పార్వతితో చెప్పిరి.

*యద్యప్యధీతాః నిగమాః షడఙ్గాన్యాగమాః ప్రియే ।*
*అధ్యాత్మాదీని శాస్త్రాణి జ్ఞానం నాస్తి గురుం వినా॥*

"చతుర్వేదములు, షడంగములు, ఆగమములు, అధ్యాత్మాది శాస్త్రములును చదివినను గురువు లేనిదే జ్ఞానము కలుగదు." ఛాందోగ్యోపనిషత్తునందు కథ ఉన్నది.

ఒకసమయమున నారదుడు సమిత్పాణియై సనత్కుమారుని సమీపించి ప్రార్థించెను. "ఓమహాత్మా! తమరునాకు బ్రహ్మవిద్యను ఉపదేశించుడు."

సనత్కుమారుడు పలికెను. "నీకు బ్రహ్మవిద్యనుగురించి తెలిసిన దంతయును నాకు వివరించుము. పిమ్మట నీకు తెలియనిదేమైన ఉన్నచో చెప్పెదను." నారదుడు పలికెను.

"*ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాసపురాణం పఞ్చమం వేదానాం వేదం పిత్ర్యం రాశిం దైవం నిధిం వాకోవాక్యమేకాయనం దేవవిద్యాం బ్రహ్మవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాం నక్షత్రవిద్యాం సర్పదేవజనవిద్యాం ఏతద్భగవోఽధ్యేమి॥*

"స్వామీ! నేను ఋగ్వేదము చదివితిని. యజుర్వేదము, సామవేదము, నాలుగవదగు అథర్వణవేదము, ఇతిహాసపురాణమగు పంచమవేదము, వేదములవేదము (వేదములను తెలిసికొనుటకు సాధన

మగు వ్యాకరణము) శ్రాద్ధకల్పము, గణితము, ఉత్పాతజ్ఞానము, నిధిశాస్త్రము, తర్కశాస్త్రము, నీతిశాస్త్రము, నిరుక్తము, వేదవిద్య, (శిక్ష, కల్పము, ఛందశ్శాస్త్రము, చితిశాస్త్రము- అగ్నిహోత్రాగ్నిని సమకూర్చువిద్య) భూతతంత్రము, ధనుర్వేదము, జ్యోతిషము, సర్పవిద్య (గారుడము) దేవజనవిద్య (గంధధారణసామర్థ్యము, నృత్యము, గీతము, వాద్యము, శిల్పము) మొదలగు విజ్ఞానములనన్నిటిని ఎరుగుదును." "అయిన నీవు సర్వజ్ఞుడవు, స్వతంత్రుడవు, కృతార్థుడవు" అని సనత్కుమారుడు పలికెను. నారదుడు తిరిగి పలికెను.

*"సోఽహం భగవో మన్త్రవిదేవాస్మి నాఽఽత్మవిచ్ఛ్రుతం హ్యేవ మే భగవద్దృశేభ్య స్తరతి శోకమాత్మవిదితి సోఽహం భగవః శోచామి తం మా భగవచ్ఛోకస్య పారం తారయత్వితి తం హోవాచ యద్వై కించైతదధ్యగీష్ఠా నామైవైతత్॥"*

"ఓమహాత్మా! నేను మంత్రములను (కర్మలను) మాత్రమే ఎరుగుదును. ఆత్మవేత్తను కాను. ఆత్మజ్ఞాని అకృతార్థబుద్ధిరూపమగు మనఃపరితాపమును అధిగమించునని తమవంటివారలనుండి వింటిని. ఓమహానుభావా! నేను ఆత్మజ్ఞానిని కానందున అకృతార్థబుద్ధితో సర్వకాలములయందును బాధపడుచున్నాను. నన్ను ఈశోకసాగరమునుండి తరింపజేయుడు."

సనత్కుమారుడు చెప్పెను:-నీవు తెలిసికొన్న దంతయును నామమాత్రము. జనులు విష్ణుబుద్ధితో విగ్రహమును ఉపాసించునట్లు నీవు (1) నామమును ఉపాసించుము. నామము బ్రహ్మము అని ఉపాసించువారికి నామవిషయమునందు ఇష్టానుసారముప్రవృత్తి కలుగును. అనగా నామోపయోగము క్రమబద్ధమగును. ఈఉపదేశమునువిని నారదుడు ప్రశ్నించెను. "బ్రహ్మదృష్టి కలుగుటకు నామముకంటె మించినది ఏదైన కలదా?" సనత్కుమారుడు జవాబు చెప్పెను.

"ఉన్నది. శబ్దములను ఉచ్చరించు (2) వాక్కు నామముకంటె మించినది." వాక్కును బ్రహ్మముగా నెరిగి నారదుడు తిరిగి ప్రశ్నించెను. "వాక్కుకంటె మించినది వేరొండు కలదా?" సనత్కుమారుడు చెప్పెను. "కలదు. వాక్కుకంటె మించినది (3) మనస్సు. మనస్సు అనగా వివక్షాబుద్ధిస్వరూపమగు అంతఃకరణప్రవృత్తి. అది వాక్కు యొక్క ప్రేరకము. ఏలనన వివక్షాబుద్ధిలేనిచో వాక్కు ఉచ్చరించబడదు. కావున మనోబ్రహ్మమును ఉపాసించుము. అట్టివానికి మానసికవిషయములయందు ఇష్టానుసారము ప్రవృత్తి కలుగును. (మనోనిరోధము జరుగును.)

నారదుడు తిరిగి ప్రశ్నించెను. "మనస్సుకంటె మించినది ఏదైన కలదా?" సనత్కుమారుడు చెప్పెను "మనస్సుకంటె మించినది (4) సంకల్పము. సంకల్పము అనగా విషయములను కర్తవ్యములుగను, అకర్తవ్యములుగను విభజించు అంతఃకరణవృత్తి. సంకల్పముచే జగమంతయును సామర్థ్యమును పొందును. సంకల్పబ్రహ్మమును ఉపాసించువానికి సంకల్పవిషయములయందు ఇష్టానుసారము ప్రవృత్తి కలుగును. కావున సంకల్పమును బ్రహ్మబుద్ధితో ఉపాసించుము." అట్లుఉపాసించి నారదుడు మరల ప్రశ్నించెను. "బ్రహ్మదృష్టి కలుగుటకు సంకల్పముకంటె మించినది వేరొకటి కలదా?"

సనత్కుమారుడు సమాధానము చెప్పెను. "(5) చిత్తము సంకల్పముకంటె మించినది. చిత్తమనగా లబ్ధపదార్థములను అవగతము చేసికొను సామర్థ్యము అను అంతఃకరణవృత్తి. ఈవృత్తి లేనిదే సంకల్పము అసంభవము. కావున సంకల్పముకంటె చిత్తము మించినది. కావున చిత్తబ్రహ్మమును ఉపాసించుము. పిమ్మట చిత్తవిషయములందు ఇష్టానుసారము ప్రవృత్తి కలుగును." అట్లు ఉపాసించి నారదుడు అడిగెను.

"బ్రహ్మదృష్టికి చిత్తముకంటె మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు సమాధానము చెప్పెను. "లేకేమి? చిత్తముకంటె మించినది (6) ధ్యానము:—ధ్యానమనగా శాస్త్రముద్వారా దేవతాదులను ఆలంబనములుగా భావించు వృత్తి. ఆలంబనము అను ఏకాగ్రతావృత్తి లేనిదే చిత్తనిశ్చలతకు తావులేదు. కావున ధ్యానదృష్టితో బ్రహ్మమును ఉపాసించుము. ధ్యానబ్రహ్మమును ఉపాసించువానికి తత్త్వమునకు సంబంధించిన పదార్థము లన్నియును లభించును." ఇట్లు ధ్యానబ్రహ్మోపాసనమును తెలిసికొని నారదుడు అడిగెను. "ధ్యానముకంటె మించినది ఏమైన కలదా?"

సనత్కుమారుడు సమాధానము చెప్పెను:—

"(7) విజ్ఞానము ధ్యానముకంటె మించినది. విజ్ఞానమనగా శాస్త్రాదివిషయకమగు జ్ఞానము. అర్థజ్ఞానము లేనిదే ధ్యానము అసంభవము. శివుడు, విష్ణువు మొదలగు వ్యక్తులరూపము అనుఅర్థము తెలియనిదే ధ్యానము జరుగదు. కావున ధ్యానముకంటె విజ్ఞానము శ్రేష్ఠమైనది. కావున విజ్ఞానరూపమగు బ్రహ్మమును ఉపాసించుము. పిమ్మట విజ్ఞానమునకుసంబంధించిన పదార్థములన్నియును లభించును.', అట్లు ఉపాసించి నారదుడు తిరిగి ప్రశ్నించెను. "విజ్ఞానముకంటె మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు చెప్పెను. "విజ్ఞానముకంటె మించినది(8) శారీరిక బలము. వందమంది జ్ఞానులను ఒక శారీరిక బలసంపన్నుడు కంపింపజేయును. కావున నీవు బలబ్రహ్మమును ఉపాసించుము. అట్లుచేయువానికి బలమునకు సంబంధించిన పదార్థములు అన్నియును లభించును." బలబ్రహ్మోపాసనానంతరము నారదుడు మరల ప్రశ్నించెను. "బలముకంటెమించినది వేరొకటికలదా?" సనత్కుమారుడు సమాధానము చెప్పెను. "బలమునకు మించినది (9) అన్నము. అన్నము లేనిదే బలము కలుగదు. పదిరోజులు అన్నము

తిననిచో పూర్తిగా దుర్బలుడగును. ఏమియును చేయలేడు. కావున బలమునకు కారణము అన్నము. ఆ అన్నమును నీవు బ్రహ్మరూపమున ఉపాసించుము. ఇట్లు చేసినవానికి అన్నవిషయకమగు పదార్థములన్నియును లభించును." అన్నబ్రహ్మోపనానంతరము నారదుడు తిరిగి ప్రశ్నించెను.

"అన్నబ్రహ్మమునకు మించినది వేరొకటి కలదా?" సనత్కుమారుడు జవాబు చెప్పెను."అన్నముకంటె మించినది (10) జలము. జలములేనిదే అన్నము పండదు. అల్పవృష్టిచే తక్కువ అన్నము పండును. సువృష్టిచే బాగుగా అన్నము (ఆహారపదార్థములు) పండును. కావున జలబ్రహ్మమును అట్లు ఉపాసించుము. ఉపాసించువాడు జలమునుండి ఉద్భవించు విషయములన్నిటిని పొందును."

జలబ్రహ్మోపాసనానంతరము "బ్రహ్మదృష్టికి జలబ్రహ్మముకంటె మించినది వేరొకటి ఏమి?" అని ప్రశ్నింప సనత్కుమారుడు చెప్పెను. "జలమునకు మించినది (11) తేజస్సు. తేజము వాయువును గ్రహించి ఆకాశమున వ్యాపించినప్పుడు ఈతాపముచే ఇక వర్షము వచ్చును అని జనులు చెప్పెదరు. కావున తేజము జలముకంటె మించినది. కావున తేజోరూపముకల బ్రహ్మమును ఉపాసించుము. దానిని ఉపాసించువానికి తేజస్సునకు సంబంధించిన విషయములు అన్నియును లభించును." తేజోబ్రహ్మోపాసనానంతరము నారదుడు మరల ప్రశ్నించెను.

"బ్రహ్మోపాసనకు తేజస్సునకు మించినదేది?" అని అడుగగా "తేజమునకు మించినది (12) ఆకాశము. ఏలనన ఆకాశమునందు తేజోవంతమగు పదార్థములు అన్నియు సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు, నక్షత్రములు మొదలగునవి దృగ్గోచరము లగును. కావున తేజమునకు మించినది ఆకాశము. నీవు ఆకాశమును బ్రహ్మరూప

మున ఉపాసించుము. ఆవిధముగ చేయుటచే తద్విషయకములగు పదార్థములన్నియు నీవశమగును.” అని జవాబు చెప్పెను.

“ఆకాశబ్రహ్మముకంటె మించినది బ్రహ్మదృష్టి కలుగుటకు వేరొకటి ఉన్నదా?” నారదుడు అని ప్రశ్నించెను. సనత్కుమారుడు జవాబు చెప్పెను. “ఆకాశమునకు మించినది (13) స్మరణము. ఇంత వరకు కార్యకారణభావరూపమున ఉత్తరోత్తరము వ్యాపకమగు పదార్థములయందు బ్రహ్మదృష్టిని కలుగజేసితిని. ఇప్పుడు తద్భిన్నమగు నిమిత్తనైమిత్తికభావరూపమును తెలుపుదును. స్మరణములేనిదే ఏవ్యవహారముకూడ సంభవము కాదు. కావున ఆకాశముకంటె స్మరణము శ్రేష్ఠము. ఆస్మరణమునందు బ్రహ్మదృష్టిని పొందుము. స్మరణమునందు బ్రహ్మదృష్టిని పొందినవానికి తద్విషయములు లభించును.” స్మరణబ్రహ్మమును ఉపాసించినతరువాత నారదుడు అడిగెను. “బ్రహ్మోపాసనకుస్మరణముకంటె మించినది వేరొకటికలదా?”

సనత్కుమారుడు జవాబు చెప్పెను. “స్మరణముకంటె మించినది (14) ఆశ. అంతఃకరణమున వృద్ధినిపొందిన విషయములు అన్నియును ఆశ లేనిదే స్మరించబడవు. ఋగ్వేదాదులను అధ్యయనము చేయవలెనను ఆశ ఉన్నచో ఆ అధ్యయనవిషయముల స్వాధ్యాయము తరచు చేయువలెను. కావున నీవు ఆశాబ్రహ్మమును ఉపాసించుము. దానిచే నీకు ఆవిషయమునకు చెందిన పదార్థములన్నియును లభించును.” ఆశాబ్రహ్మమును ఉపాసించి ప్రశ్నించెను.

“ఆశకంటె మించినది కలదా?” సనత్కుమారుడు సమాధానము చెప్పెను “ఆశకంటె (15) ప్రాణము మించినది. ఈవిషయమున శ్రుతిని పరికింపుడు.

“ప్రాణో వా ఆశాయా భూయాన్ యథా వా అరా నాభౌ సమర్పితా ఏవమస్మిన్ ప్రాణే సర్వం సమర్పితం ప్రాణః ప్రాణేన యాతి

*ప్రాణః ప్రాణం దదాతి ప్రాణాయ దదాతి ప్రాణో హ పితా ప్రాణో మాతా ప్రాణో భ్రాతా ప్రాణః స్వసా ప్రాణ ఆచార్యః ప్రాణో బ్రాహ్మణః ॥"*

"ప్రాణమే ఆశకంటె మించినది. చక్రముయొక్క కుంచములో ఆకులు ఇమిడియున్నట్లు ఈసమష్టిప్రాణమునందు జగమంతయు ఉన్నది. ప్రాణము ప్రాణముచే సంచరించును. ప్రాణము ప్రాణము నిచ్చును. ప్రాణము తండ్రి, ప్రాణము తల్లి, ప్రాణము సోదరుడు, ప్రాణము సోదరి, ప్రాణము ఆచార్యుడు, ప్రాణము బ్రాహ్మణుడు."

మూర్ఖుడు ఎవడైన తన తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, ఆచార్యుడు, బ్రాహ్మణుడు మొదలగువారిపట్ల అనుచితప్రవర్తనను కలిగియున్నచో వానిని నిందించెదరు. కాని శరీరమునుండి ప్రాణముపోయిన తరువాత ఆశరీరమును దహించినను, దానిఅవయవములను ఛేదించినను అతడు హంతకుడుగ పేర్కొనబడడు. కావున ఇదంతయును ప్రాణమే. ప్రాణమే అన్నిఅనుభవములను, చింతనములను, నిశ్చయములను చేయును. అదియే అతివాది. నామము మొదలుకొని ఆకాశము వరకుగల జగమునంతను అతిక్రమించి జగమంతకును ఆత్మను నేను అని చెప్పును. "వీని అన్నిటికంటెను మించినది ప్రాణమే. దీనికి మించినది ఏమియు లేదు" అనుకొని నారదుడు ఇక ప్రశ్నించలేదు.

అనంతరము సనత్కుమారుడు అనుగ్రహించి మిథ్యాజ్ఞానమునుండి అతనిని తప్పించి సత్యాదులను ఉపదేశించెను.

## సత్యోపదేశము.

*"ఏష తు వా అతివదతి యః సత్యేనాతివదతి సోఽహం భగవః సత్యేనాతివదానీతి సత్యం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి సత్యం భగవో విజిజ్ఞాస ఇతి॥"*

"ప్రాణమును తెలిసికొనినవాడు నిజమునకు అతివాది కాదు సత్యాతివాదియే నిజమగు అతివాది." అని సనత్కుమారుడు చెప్పినంతనే నారదుడు ప్రశ్నించెను. "నేను సత్యాతివాదినగు విధమును తెలుపుము." శ్రేష్ఠమగు సత్యమే తెలిసికొనదగినది. కావున నేను ఆ సత్యమును తెలిసికొనగోరుచున్నాను. తరువాత విజ్ఞానప్రాముఖ్యమును సనత్కుమారుడు ఉపదేశించెను.

*"యదా వై విజానాత్యథ సత్యం వదతి నావిజానన్ సత్యం వదతి విజానన్నేవ సత్యం వదతి విజ్ఞానం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి విజ్ఞానం భగవో విజిజ్ఞాస ఇతి॥"*

"సత్యమును విశేషముగా నెరిగినవారుమాత్రమే సత్యమును తెలుపుదురు. విశేషముగా తెలియనివారు సత్యమును తెలుపలేరు. కావున విజ్ఞానము సత్యముకంటె మించిన జ్ఞాతవ్యవిషయము." అని సనత్కుమారుడు చెప్పెను. అంతట నారదుడు ప్రశ్నించెను. "ఓ మహాత్మా! నేను విజ్ఞానమును తెలిసికొనగోరుచున్నాను.

అనంతరము మననము ప్రధానమని చెప్పగోరి ఇట్లుపలికెను.

*"యదా వై మనుతేఽథ విజానాతి నామత్వా విజానాతి మత్వైవ విజానాతి మతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి మతిం భగవో విజిజ్ఞాస ఇతి॥"*

"మననముచే విజ్ఞానము లభించును. మననము చేయనిదే విజ్ఞానము కలుగదు. మననమును తెలిసికొనవలెను." అని సనత్కుమారుడు చెప్పినతోడనే నారదుడు ప్రశ్నించెను. "స్వామీ! నేను మననమునుగురించి వివరముగా తెలిసికొనగోరుచున్నాను."

పిదప ఆస్తిక్యబుద్ధి అను శ్రద్ధ జ్ఞాతవ్యము అనిచెప్పగోరి ఇట్లు ఉపదేశించెను.

*"యదా వై శ్రద్దధాత్యథ మనుతే నాశ్రద్దధన్మనుతే శ్రద్దధదేవ మనుతే శ్రద్ధాత్వేవ విజిజ్ఞాసితవ్యేతి శ్రద్ధాం భగవో విజిజ్ఞాస ఇతి॥"*

"శ్రద్ధ ఉన్నచో మననము జరుగును అశ్రద్ధచే మననము జరుగదు. శ్రద్ధావంతుడే మననము చేయును. కావున శ్రద్ధయే ముఖ్యముగా తెలిసికొనదగినది." ఇట్లు సనత్కుమారుడు చెప్పినంతనే నారదుడు శ్రద్ధనుగురించి చెప్పుడని ప్రార్థించెను.

*"యదా వై నిస్తిష్ఠత్యథ శ్రద్దధాతి నానిస్తిష్ఠన్ శ్రద్దధాతి నిస్తిష్ఠన్నేవ శ్రద్దధాతి నిష్ఠాత్వేవ విజిజ్ఞాసితవ్యేతినిష్ఠాం భగవో విజిజ్ఞాసఇతి॥"*

"నిష్ఠావంతునకే శ్రద్ధ కలుగును. నిష్ఠలేనిదే శ్రద్ధలేదు. కావున నిష్ఠ శ్రేష్ఠమని తెలియనగును." అని సనత్కుమారుడు చెప్పెను. అంత నారదుడు ప్రశ్నించెను. "ఓస్వామీ! నేను నిష్ఠనుగురించి తెలిసికొనగోరుచున్నాను." సనత్కుమారుడు "కృతి" (ఇంద్రియ సంయమము, చిత్తైకాగ్రతయు) తెలిసికొనదగినదని వివరించుచు ఇట్లు చెప్పెను.

*"యదా వై కరోత్యథ నిస్తిష్ఠతి నాకృత్వా నిస్తిష్ఠతి కృత్వైవ నిస్తిష్ఠతి। కృతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యేతి కృతిం భగవో విజిజ్ఞాస ఇతి॥"*

"కార్యమును ఆచరించువానికే నిష్ఠ కలుగును. చిత్తైకాగ్రత లేనిదే కార్యకర్తలకు నిష్ఠ కలుగదు. కావున "కృతి"నిగురించి ముఖ్యముగా తెలిసికొనవలెను." అంతట నారదుడు కృతినిగురించి తెలుపుమని ప్రార్థించెను. సనత్కుమారుడు కృతికంటె శ్రేష్ఠమయినది సుఖమని తెలుపుచు దానిని వివరించెను.

*"యదా వై సుఖం లభతేఽథ కరోతి నాసుఖం లబ్ధ్వా కరోతి సుఖమేవ లబ్ధ్వా కరోతి సుఖం త్వేవ విజిజ్ఞాసితవ్యమితి సుఖం భగవో విజిజ్ఞాస ఇతి॥"*

"సుఖమునకు ఇచ్చట నిరతిశయసుఖమని అర్థము. అందరును సుఖముకొరకు "కృతిని" ఆచరించెదరు. సుఖరాహిత్యముకొరకు అనగా దుఃఖముకొరకు ఎవ్వరును కృతిని ఆచరించరు. సుఖేచ్ఛచేతనే కృతి- కర్మ జరుగుచున్నది. ఆసుఖమే శ్రేష్ఠతమమని తెలిసికొన

వలెను.'' నారదుడు పలికెను. "ఆసుఖమునుగురించి తెలుపుడు.'' అనంతరము భగవానుడు "భూమ'' అనగా నిరతిశయమగు వస్తువు తెలిసికొనవలెను అని దానిని ఉపదేశించెను.

*"యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖం భూమా త్వేవ విజిజ్ఞాసితవ్య ఇతి భూమానం భగవో విజిజ్ఞాస ఇతి.''*

"నిరతిశయమగునదియే సుఖము. అల్పాధిక్యములు తృష్ణా మూలములు. తృష్ణ దుఃఖకారణము. కావున నిరతిశయమునుగురించియే బాగుగా తెలిసికొనవలెను'' అనిసనత్కుమారుడు ఉపదేశించి నంతనే నారదుడు పలికెను. "స్వామీ! నేను నిరతిశయవస్తువును-భూమను తెలిసికొనగోరుచున్నాను.''అప్పుడు సనత్కుమారులు నిరతిశయవస్తువగు భూమయొక్క- బ్రహ్మముయొక్క లక్షణము సెలవిచ్చిరి.

*"యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమాఽథ యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పం యో వై భూమా తదమృతమథ యదల్పం తన్మర్త్యం స భగవః కస్మిన్ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని యది వా న మహిమ్నీతి॥''*

"ఎచ్చట- ఏతత్త్వమునందు ఇతరములను చూచుటలేదో, ఇతరములను వినుటలేదో, అన్యవిషయములను తెలిసికొనుటలేదో. అనగా ఏది సర్వసంసారవ్యవహార రహితమో అది భూమ. ఏది ఇతరములను చూచునో, ఇతరములను వినునో, ఇతరవిషయములను తెలిసికొనునో అది అల్పము. అది స్వప్నపదార్థములవలె నశించును. తద్విపరీతమును, ప్రసిద్ధమును అగుభూమ అవినాశి. పరిచ్ఛిన్నమగునది నశ్వరము.'' సనత్కుమారుని ఈవాక్యములను విని నారదుడు ప్రార్థించెను. "భూమ దేనియందు ఉన్నది?'' సనత్కుమారుడు సమాధానము చెప్పెను. వ్యవహారదృష్టిని చూచిన తనవిభూతియందు ఉన్నది అని చెప్పవచ్చును కాని వాస్తవమునకు అవిభూతియందు

లేదు. అది ఆశ్రయరహితము, సర్వాధారము. అది దేనినికూడ ఆశ్రయించి లేదు.

కార్యకారణ భావరూపమగు నామమునుండి ఆకాశపర్యంతము కల వ్యాపకలక్షణ విశిష్టమగు పదార్థములను వివరించినతదుపరి సనత్కుమారుడు నారదునకు స్మరణము మొదలుకొని సుఖమువరకుగల నిమిత్తనైమిత్తిక భావరూపమును ఉపదేశించెను. పిమ్మట యథార్థామృతరూపమగు భూమను వివరించెను. ఈభూమను తెలిసికొనినచో సర్వమును తెలియును. ఏలనన భూమ సర్వాధారము. సర్వాధిష్ఠానము. ఈభూమరూపమగు చరమోపదేశమునకు పూర్వము చెప్పబడిన నామాదులయందు బ్రహ్మదృష్టితో ఉపాసన చేయవలెననునది అంతయును ప్రతీకోపాసనయే. సంసారదుఃఖపరితప్తుడగు నారదుడు సనత్కుమారునితో "నేను నామము నేఎరుగుదును. ఆత్మను ఎరుగను" అని చెప్పెను. అంతట సనత్కుమారుడు "ఆనామమునందే బ్రహ్మదృష్టిని పొందు"మని శాసించెను. అనంతరము నారదుడు సకలనామములయందును బ్రహ్మదృష్టిని నిలిపి ఉపాసించెను. తరువాత నారదుడు నామబ్రహ్మముకంటె మించినదేమైన కలదా అని ప్రశ్నించెను. సమాధానముగా సనత్కుమారుడు క్రమముగా నామబ్రహ్మము మొదలుకొని వాక్కు, మనస్సు, సంకల్పము, చిత్తము, ధ్యానము, విజ్ఞానము, బలము, అన్నము, జలము, తేజము, ఆకాశము, స్మరణము, ఆశ, ప్రాణము, సత్యము, మననము, ఆస్తిక్యబుద్ధిరూపమగు శ్రద్ధ, ఆచార్యసేవారూపమగు నిష్ఠ, కృతి, సుఖము, భూమ– ఈవిధముగా ఉత్తరోత్తరాధిక్యముకల పదార్థములయందు బ్రహ్మదృష్టిని కలుగజేయుచు వానిని ఉపాసించవలసిన అవసరమును తెలిపెను. ఇది ఇంతవరకును మీరు తెలిసికొనియే ఉన్నారు.

నారదునివంటివాడుకూడ అంతవిద్వాంసుడయినను శోకరహితుడయి ఆత్మవిద్యను తెలిసికొనలేనందున సనత్కుమారుని చెంతకు వెళ్ల

పలసివచ్చెను. కావున శాస్త్రాభ్యాసమాత్రముచే సూక్ష్మమగు బ్రహ్మవిద్య తెలియరాదు. దానికొరకు అనుభవముకలవానివద్ద ఉపదేశమును పొందితీరవలెను. డాక్టరీ తెలియుటకొరకు మెడికలుకాలేజీలో చదువుకొనినను మంచిఅనుభవముకల డాక్టరువద్ద అభ్యాసము చేయుట అవసరముకాదా? అటులనే బ్రహ్మవిద్యా జ్ఞానముకూడ గురువులేనిదే లభించదు.

స్వా. ని. :— బృహదారణ్యకోపనిషత్తునందు చెప్పబడినది.

"ఆచార్యవాన్ పురుషో వేద"

"ఆచార్యుడుకలవాడు (గురువును శరణుజొచ్చినవాడు) ఆత్మను తెలిసికొనును." ఆచార్యలక్షణము సూతసంహితయందు ఉన్నది.

## ఆచార్యలక్షణము

ఆచార్య ఏవ సంసారమోచనప్రద ఉచ్యతే ।
ఆచార్యో నామ వేదాన్తవిచారేణాప్తవేదనః ॥

"సంసారమునుండి ముక్తిని కలుగజేయువాడు ఆచార్యుడు. వేదాంతశాస్త్రవిచారముచే తత్త్వజ్ఞానమును పొందినవాడు ఆచార్యుడు." ఆచార్యలక్షణమును శ్రీశంకరభగవత్పాదులవారు ఉపదేశసాహస్రియందు స్పష్టముగా చెప్పిరి.

"ఆచార్యస్తూహాపోహగ్రహణధారణశమదమదయానుగ్రహాదిసంపన్నో లబ్ధాగమో ద్రష్టా దృష్టభోగేష్వనాసక్తః, త్యక్తసర్వకర్మసాధనో బ్రహ్మవిత్ బ్రహ్మణి స్థితోఽభిన్నవృత్తో దమ్భదర్పకుహకశాఠ్యమాయామాత్సర్యానృతాహంకారమమత్వాదిదోషవివర్జితః, కేవలపరానుగ్రహప్రయోజనో విద్యోపయోగార్థీ పూర్వముపదిశేత్ ॥

ఆచార్యుడు ఈక్రిందిగుణములను కలిగియుండవలెను.

ఊహ:— శిష్యునకు సందేహమును వెల్లడించు శక్తి లేనప్పుడు అతని సందేహమును తెలిసికొని, ప్రశ్న అసంపూర్ణమైనచో పూర్తి చేసి, ఉపదేశించుటతోడనే జ్ఞానమును కలుగజేయు అపూర్వములగు

యుక్తులను కలిగియుండుట. అపోహ:- సిద్ధాంతవిరుద్ధమగు పక్షమును నిరాకరించు సామర్థ్యము. గ్రహణము:- శిష్యుడు అడిగిన ప్రశ్నలను వెంటనే తెలిసికొనుట. ధారణ:- గ్రహించిన ప్రశ్నలను సమగ్రముగా వివరించుసమయమున అవధారణతో జ్ఞాపకము ఉంచుకొను సామర్థ్యము. శమము:-మనోనిగ్రహము. దమము:- ఇంద్రియనిగ్రహము. దయ:- దుఃఖించువారిని చూచుటచే జనించు కరుణ. అనుగ్రహము:-దయకలిగిన మీదట దుఃఖించువారి దుఃఖములను పోగొట్టవలెనను స్వభావము. ఇట్టిగుణములు ఆచార్యునియందు ఉండవలెను. మరియు శాస్త్రజ్ఞుడును, ఇహపరభోగములయందు ఆసక్తి కలిగియుండనివాడును, కర్మసాధనములను, స్త్రీధనాదులను త్యజించినవాడును, బ్రహ్మజ్ఞుడును, బ్రహ్మభేదమును కలిగించు శాస్త్రవిహితములగు ఆచారములను పాలించువాడును, దంభము (మిథ్యాధర్మాడంబరము) గర్వము, ఇతరులను మోసగించుట, నిష్ఠురత్వము, ఇతరులకు భ్రాంతిని కలుగజేయుట, ఇతరులగుణములను దోషములుగా వర్ణించుట, అసత్యభాషణము, దేహాభిమానకృతములగు శిష్యాదులయందు మమత్వాదిదోషములు ఇవి-కొంచెమైన లేనివాడును అయియుండవలెను. అతడు కేవలుడుగానుండి ప్రపంచమునందు ఔదాసీన్యమును పొంది ఇతరులయందు అనుగ్రహము కలిగియుండుటమాత్రమే ప్రయోజనముగా కలిగి, విద్యను సదుపయోగ మొనరించుటయే కోరుకొనుచుండవలెను. ఇట్టి ఆచార్యుడు వెనుక చెప్పిన బ్రహ్మవిద్యను ఉపదేశించవలెను. ఆచార్యలక్షణములు మనుస్మృతియందుకూడ కలవు.

*ఉపనీయ తు యః శిష్యం వేదమధ్యాపయేత్ ద్విజః ।*
*సకల్పం సరహస్యం చ తమాచార్యం ప్రచక్షతే॥*

శిష్యునకు ఉపనయనముచేసి తనఇంటికి తీసికొనివెల్లి కల్ప (యజ్ఞవిద్య) యుక్తమును, రహస్య (దశోపనిషత్తులు) యుక్తమును అగు వేదమును నేర్పువాడు ఆచార్యుడు.

పెద్దవిద్యార్థి:—ఈరోజులలో శిష్యపరంపర, పుత్రపరంపర వలె అనుక్రమమున వాడుకలో నున్నదికదా? అట్టివారు ఆచార్యు లనబడుదురా?

స్వా. ప్ర. :—ఆచార్యులనియే చెప్పబడుదురు. బ్రాహ్మణు లలో ద్వివేది, త్రివేది, చతుర్వేది మొదలగు వంశనామములు ఉన్నట్లే వారుకూడ ఆచార్యసంజ్ఞతో వ్యవహరించబడుదురు. యథా ర్థమునకు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మాధవా చార్యులు మొదలగు భాష్యకారులు మాత్రమే ఆచార్యులు అని చెప్పబడుదురు.

పెద్దవిద్యార్థి :—గురువు ఒకరే ఉండవలెనా అనేకులు ఉండవచ్చునా?

స్వా. ప్ర. :—మీకు కాలేజీలో ప్రతివిషయమును ఒక్కొక్క ప్రొఫెసరు నేర్పుదురు. ఇంగ్లీషు, సంస్కృతము, అర్థశాస్త్రము మొద లగు విషయములకు వేరువేరు ప్రొఫెసర్లు ఉందురు. అటులనే సం స్కృతమునందుకూడ వ్యాకరణము, న్యాయము, మీమాంస మొద లగు విషయములకు వేరువేరు గురువులు ఉందురు. అదే విధముగ కర్మ, ఉపాసన, జ్ఞానములకుకూడ వేరువేరుగురువులు ఉండవచ్చును.

ఒకమారు ఉద్దాలకమహర్షికుమారుడు శ్వేతకేతుడు ప్రవా హణుడను రాజునాస్థానమునకు గౌరవప్రతిష్ఠలను సంపాదించవలెనను కోరికతో వెళ్ళెను. సభలో ప్రవాహణుడు అతనిని ప్రశ్నించెను. "నీవు తండ్రివద్ద అనుశాసనమును పొందితివా?" "చిత్తము. నేనున్ని విద్యలను నేర్చుకొంటిని." "నీవు పంచాగ్నివిద్యను నేర్చుకొంటివా?" "చిత్తము. నేర్చుకొంటిని."

అంతట రాజు ఆతనిని పంచాగ్నివిద్యకు సంబంధించిన ప్రశ్న లను అడిగెను. శ్వేతకేతుడు ఒకదానికికూడ సమాధానము చెప్ప

లేదు. అందుచే గౌరవము లభించుటకు బదులు అతనికి అగౌరవము కలిగెను. అప్పుడు ఆతడు తండ్రివద్దకు వెళ్ళి చెప్పెను. "నన్ను ప్రవాహణమహారాజు అడిగిన ప్రశ్నలలో ఒక్కదానికికూడ నాకు సమాధానము తెలియలేదు. మీరు నాకు నేర్పలేదు." తండ్రి అడిగెను:—ఏమి ప్రశ్నించెను?" శ్వేతకేతుడు పంచాగ్ని ప్రసంగమును దెలిపెను. తండ్రి చెప్పెను:—"అది నాకుకూడ తెలియదు."

అనంతరము ఆయన ప్రవాహణుని వద్దకు వెళ్ళి పంచాగ్ని విద్యను నేర్చుకొనెను. ఉద్దాలకమహర్షి గొప్పతత్త్వవేత్త. అయినను యజ్ఞవిద్య నేర్చుకొనుటకు ఆతడు ప్రవాహణరాజువద్దకు వెళ్ళెను. కావున తనకు తెలియని విద్యను తెలిసికొనుటకు తెలిసినగురువువద్దకు వెళ్లుట తప్పుకాదు. గురుగీతయందు పార్వతితో శంకరులు చెప్పిరి:—

*మధులుబ్ధో యథా భృఙ్గః పుష్పాత్ పుష్పాన్తరం వ్రజేత్।*
*జ్ఞానలుబ్ధః తథా శిష్యో గురోర్గుర్వాన్తరం వ్రజేత్॥*

"తేనెయందు ఆశగల భ్రమరము ఒకపుష్పమునుండి మరియొక పుష్పమువద్దకు వెళ్ళును. అటులనే జ్ఞానపిపాసువగు శిష్యుడు ఒక గురువువద్దనుండి మరియొక గురువువద్దకు వెళ్ళవలెను."

పెద్దవిద్యార్థి:—తమకు శాస్త్రములను ఉదహరించి ఒక గురువువద్దనుండి మరియొక గురువువద్దకు వేరువేరువిద్యలను నేర్చుకొనుటకు వెళ్ళవలెనని తెలిపిరి. కాని ఒక్కొక్కప్పుడు ఒకగురువు ఒకఅభిప్రాయమును ప్రకటించిన, వేరొకగురువు వేరొకఅభిప్రాయమును ప్రకటించును. ఇట్లు గురువులయందు మతవైవిధ్యము కన్పించిన ఏమి చేయవలెను?

స్వా. ప్ర. :— సాంఖ్యసూత్రము చెప్పుచున్నది.

*"బహుశాస్త్రగురూపాసనేఽపి సారాదానం షట్పదవత్"*

"అనేకశాస్త్రముల గురువులను ఉపాసించినను భ్రమరమువలె సారము గ్రహించవలెను." భ్రమరము ఒకవృక్షమునుండి మరియొక

వృక్షమునకు అచ్చటినుండి ఇంకొక వృక్షమునకు ఇట్లు అనేక వృక్షములవద్దకు వెళ్ళును. వాటి పుష్పములపై కూర్చొనును. ప్రతివృక్షమునందును ఏదియో ఒక భేదము ఉండితీరును. కాని భ్రమరము వాని పత్రములు, ఫలములు మొదలగువానిపై తనదృష్టిని ప్రసరింపజేయదు. ప్రతిపుష్పముయొక్క రసమునుమాత్రము- మధువును మాత్రము పానముచేయును. అటులనే జిజ్ఞాసువు అనేకులగు గురువులవద్దకు తప్పక వెళ్ళవలెను. వారివద్దనుండి లభించిన జ్ఞానమును గ్రహించవలెను. వైవిధ్యములు కన్పించినచో ఆవైవిధ్యములపై విశేషలక్ష్యమును చూపక సర్వసిద్ధాంతసారమగు జ్ఞానామృతమునుమాత్రమే గ్రహించవలెను.

షట్ దర్శనముల సిద్ధాంతములు వేరు వేరు. ఒకదానికి మరియొకటి భిన్నము అయినను అన్నిదర్శనములను అభ్యసించవలెను. వీని అన్నిటియందును కల సామాన్యధర్మమును ప్రతివాడును అంగీకరించవలెను. ఉదాహరణకు సాంఖ్య, యోగ, న్యాయ ప్రక్రియలలో కొన్నిటిని వేదాంతము అంగీకరించినది. ఉపకరించువస్తువు ఎచ్చటనుండి లభించినను దానిని ఉపేక్షించరాదు. అంతేకాదు. దానిని పొందుటకు అనేకులగు గురువులను ఉపాసించి వివేకబుద్ధిని ఎల్లప్పుడును ఉపయోగించుటకు సిద్ధముగా నుండవలెను.

ఈవిధముగా మంత్రమును ఉపదేశించు గురువు-గాయత్రీ ప్రణవాదులను ఉపదేశించు గురువు ఒకడే ఉండును. కాని జ్ఞానమునకు సంబంధించిన ఇతరవిషయములకు ఇతరగురువులుకూడ ఉండవచ్చును. వారివద్ద జ్ఞానమును సంపాదించవలెను. అందుకు అభ్యంతరము లేదు. అటులనే గాయత్ర్యాదుల జపానుష్ఠానాదుల పద్ధతులను తెలుపు మరియొకగురువును కలిగియుండుటలో తప్పేమియు లేదు.

## యజ్ఞోపవీత రహస్యము

పె. వి. :— యజ్ఞోపవీతము ధరించుటకు కల కారణమేమి? అది పురుషులు మాత్రమే ఏల ధరించవలెను? ఈమధ్య కొంతమంది అనధికారులుకూడ ధరించుచున్నారు. ధరించినవారు దానియందు గౌరవభావమును వ్యక్తపరచుటలేదు. అధికారము ఉన్నవారు కొందరు ధరించుటయే లేదు. దీనికి సంబంధించిన రహస్యములను ఎరిగింపుడు.

స్వా. ప్ర. :— యజ్ఞోపవీతశబ్దమును వివేచన చేయుటచే దానిని ధరించుటకు కల కారణములు తెలియును. అందుకు సంబంధించిన సందేహములు నిర్మూలమగును.

యజ్ఞ–ఉప–వి–ఇత=యజ్ఞమునకు దరిజేరుట. యజ్ఞశబ్దమునందు "యజ్" ధాతువు కలదు. అందుచే యజ్ఞాధికారమును పొందుట అని అర్థము. యజ్ఞోపవీతసంస్కారము యజ్ఞాధికారము నిచ్చును. ఇది సకామ, నిష్కామ కర్మల నియమములను పాటించుటకు చేయు ప్రతిజ్ఞకు చిహ్నము. నాలుగు వేదములయందును యజ్ఞోపవీతధారణకు మంత్రములు కలవు.

1. ఋగ్వేదము :—

*ఓం యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేర్యత్ సహజం పురస్తాత్*
*ఆయుష్యమగ్ర్యం ప్రతిముఞ్చ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః*

"యజ్ఞోపవీతము పరమపవిత్రమైనది. జ్ఞానరూపమగు యజ్ఞోపవీతము పూర్వము ప్రజాపతితోకూడ జన్మించినది. ఆయువు, బలము, తేజము, సర్వశ్రేష్ఠత్వము ఇచ్చునదియును, అంతఃకరణమును నిర్మలమొనర్చునదియును అగు యజ్ఞోపవీతమును నేను ధరించుచున్నాను."

2. యజుర్వేదము :—

*ఓం యజ్ఞోపవీతం పరమం పవిత్రం బృహస్పతేర్యత్ సహజం పురస్తాత్*
*ఆయుష్యమగ్ర్యం ప్రతిముఞ్చ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః॥*

"ప్రజాపతి" శబ్దమునకు బదులుగా యజుర్వేదమున "బృహస్పతి" శబ్దము ఉపయోగించబడినది. మిగతా అర్థము సమానము.

3. సామవేదము :—

ఓం యజ్ఞోపవీతమసి యజ్ఞస్య త్వా యజ్ఞోపవీతేనోపనహ్యామి॥

"ఇది యజ్ఞోపవీతము, ఈయజ్ఞోపవీతముద్వారా నిన్ను యజ్ఞసమీపమునకు తీసికొని వెళ్ళెదను."

4. అథర్వణవేదము :—

ఓం యజ్ఞోపవీతమసి యజ్ఞస్య త్వా యజ్ఞోపవీతేనోపనహ్యామి॥

(అర్థము పైమంత్రముతో సమానము)

పరాప్రకృతి లేక, మాయ బ్రహ్మాఽభిన్నమగు జీవుని తన సత్త్వరజస్తమములను త్రిగుణములయిన, త్రిగుణకార్యములును అనబడు బంధములతో కట్టి ఉంచును అనుదానిని యజ్ఞోపవీతము సూచించును. మాయాగుణములగు సత్త్వరజస్తమను లనబడు మూడను రజస్తమోమిశ్రమమగు అధికసత్త్వమును, సత్త్వతమోమిశ్రమమగు అధిక రజోగుణము, రజస్సత్త్వమిశ్రమమగు అధికతమోగుణము—ఇట్లు వైవిధ్యముచే 9 గుణము లగును. ఈ తొమ్మిదింటికిని తొమ్మిది తంతువులును ప్రతీకములుగా తలచవలెను. శుద్ధ రజస్తమస్సత్త్వరూపమగు త్రిగుణాత్మకమగు అవిద్య బ్రహ్మగ్రంథి. ఇట్టి యజ్ఞోపవీతము ధరించబడును. దీనిచే సాధకుడు ఎల్లప్పుడును ఏమరుపాటు లేకుండ ఈవిషయమును గుర్తుంచుకొనును. "నేను నవతంతుయుక్తమగు మాయాపాశముచే బద్ధుడనై యున్నాను. యజ్ఞాద్యనుష్ఠానముచే చిత్తమును శుద్ధినొందించుకొని నేను ఈ పాశమును ఛేదించవలెను." ఈవిధముగా అవిద్యాబంధనము నిరంతరము గుర్తుకు వచ్చుచుండుటకు ఆ బంధనప్రతీకముగా సాధకుడు యజ్ఞోపవీతమును ధరించవలెను. వేదోక్తమగు యజ్ఞానుష్ఠానముద్వారా బంధనముక్తికి ప్రయత్నించవలెను.

యజ్ఞోపవీతమును ధరించు అధికారము బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణములకు మూడింటికిని కలదు అని మనుస్మృతి చెప్పుచున్నది.

*గర్భాష్టమేఽబ్దే కుర్వీత బ్రాహ్మణస్యోపనాయనమ్ ।*
*గర్భాదేకాదశే రాజ్ఞో గర్భాత్తు ద్వాదశే విశః॥*
*బ్రహ్మవర్చసకామాయ కార్యం విప్రస్య పఞ్చమే ।*
*రాజ్ఞో బలార్థినః షష్ఠే వైశ్యాయేహార్థినోఽష్టమే॥*

"గర్భము మొదలుకొని 8వ సంవత్సరమున బ్రాహ్మణునకును, 11వ సంవత్సరమున క్షత్రియునకును, 12వ సంవత్సరమున వైశ్యునకును యజ్ఞోపవీతము నర్పించవలెను. కాని బ్రహ్మవర్చస్సును (తేజస్సును) కోరు బ్రాహ్మణుడు 5వ సంవత్సరమునను, బలము కోరు క్షత్రియుడు 6వ సంవత్సరమునను, లౌకిక సుఖములనుకోరు వైశ్యుడు 8వ సంవత్సరమునను తమ బాలకులకు ఉపనయన సంస్కారము చేయవలెను." పూర్వము స్త్రీపురుషులకు ఉభయులకునుకూడ యజ్ఞోపవీతధారణ ఉండెననుటకు శాస్త్రమునందు ఆధారము కలదు.

*పురా కల్పే కుమారీణాం మౌఞ్జీబన్ధనమిష్యతే*
*అధ్యాపనం చ వేదానాం సావిత్రీవాచనం తథా॥*

"పూర్వము కన్యలకుకూడ ఉపనయనసంస్కారము చేయబడుచుండెడిది. వేదాధ్యయనము, గాయత్ర్యుపదేశముకూడ చేయబడెడివి." కాని యజ్ఞోపవీతము ధరించుట అనగా నూలుదారము మెడలో వేసికొనుట కాదు. దానితోబాటు యజ్ఞానుష్ఠానము చేయవలసియున్నది. ఈపని పిల్లలుకల స్త్రీలు చేయలేకపోయెడివారు. ఆచరించవలసినవిధముగా ఆచరించు సామర్థ్యము ఉండెడిదికాదు. పిల్లలు ఏడ్చినా, పడిపోయినా ఇంకా ఇతరవిధములగు అవసరములలో తల్లులు వెంటనే పరుగెత్తవలసివచ్చును. ఆవిధముగా కర్మవిచ్ఛేదము జరుగుట తటస్థించి స్త్రీలు యజ్ఞానుష్ఠానాదులు నిర్వహించలేరనునది

రజువయినది. అంతట పురుషులు స్త్రీలతో ఇట్లు చెప్పిరి. "మీపనులు మీరు చేయండి. మీరు గృహకృత్యములు నిర్వహించండి. మేము యజ్ఞము చేసెదము. దానిద్వారా జనించిన అపూర్వమునందు (పుణ్యమునందు) అర్ధభాగము మీకు ఇచ్చెదము." అనంతరము స్త్రీలుధరించు యజ్ఞోపవీతము పురుషులు ధరించిరి. అంతటితో స్త్రీల వేదాధ్యయనము అంతమొందినది. యజ్ఞానుష్ఠానములయందు వారు సహధర్మచారిణీస్థానమునుమాత్రము నిలుపుకొనిరి.

అవిద్యాబంధము తెగి చిత్తశుద్ధి కలుగనంతవరకు యజ్ఞోపవీతమును ధరించవలెను. "అవిద్యాప్రతీకమగు యజ్ఞోపవీతమును నేను ఏల ధరించవలెను?" అనునంతటితో అవిద్యనుండి ముక్తి కలుగదు. న్యాయాధిపతి ఏనేరస్థునికైన ఇంతకాలము శిక్ష అనుభవించవలెనని శిక్షవిధించినతదుపరి ఆ నేరస్థుడు సమయము పూర్తికాకముందే బేడీలు తెంపుకొని ఏదోవిధముగా స్వేచ్ఛను పొందదలచినచో స్వేచ్ఛకుబదులుగా ఆతనికి ఇంకను కఠినశిక్ష అదనముగా లభించును. అటులనే కర్మానుష్ఠానముద్వారా చిత్తశుద్ధి కలుగుటకుముందు యజ్ఞోపవీతమును త్రెంచి విసరివేయుటచే అవిద్యాబంధనమునుండి విముక్తి కలుగుటకు బదులుగా ఇంకను ఎక్కువగా బంధమునందు చిక్కుకొనును. కావున వానప్రస్థాశ్రమపర్యంతము యజ్ఞోపవీతమును ధరించవలెను.

యజ్ఞాద్యనుష్ఠానములద్వారా చిత్తము శుద్ధిని పొందినతరువాత అవిద్యాప్రతీకమగు బాహ్యసూత్రమును (యజ్ఞోపవీతమును) త్యజించి బ్రహ్మభావమను యథార్థసూత్రమును ధరించి సన్యాసమును స్వీకరించవలెను. బ్రహోపనిషత్తునందు చెప్పబడినది.

*సశిఖం వపనం కృత్వా బహిస్సూత్రం త్యజేద్బుధః।*
*యదక్షరం పరం బ్రహ్మ తత్సూత్రమితి ధారయేత్॥*

"విద్వాంసుడు శిఖాసహితముగా ముండనము చేయించుకొని బాహ్యసూత్రమును త్యజించి నాశరహితమగు పరబ్రహ్మసూత్రమును ధరించవలెను."

*సూచనాత్సూత్రమిత్యాహుః సూత్రం నామ పరం పదమ్*
*తత్సూత్రం విదితం యేన స విప్రో వేదపారగః॥*

"పరబ్రహ్మమును సూచించుటచే (తెలియజేయుటచే) ఈ సూత్రము (సూత్రాత్మ) పరమపదము అనగా మోక్షరూపము. ఇది మోక్షరూపమని తెలిసికొనిన విద్వాంసుడు వేదమునంతను తెలిసికొనినట్లే."

*బహిస్సూత్రం త్యజేద్విద్వాన్యోగముత్తమమాస్థితః ।*
*బ్రహ్మభావమిదం సూత్రం ధారయేద్యస్స చేతనః ॥*

"ఉత్తమమగు యోగమునందు నిష్ఠకల విద్వాంసుడు బహిస్సూత్రమును త్యజించి బ్రహ్మభావమను ఈసూత్రమును ధరించినచో ఆనరుడు ప్రకాశస్వరూపుడు అగును."

*జ్ఞానశిఖినో జ్ఞాననిష్ఠాః జ్ఞానయజ్ఞోపవీతినః ।*
*జ్ఞానమేవ పరం తేషాం పవిత్రం జ్ఞానముచ్యతే॥*

"జ్ఞానరూపమగు శిఖయును, జ్ఞానరూపమగు యజ్ఞోపవీతమును, జ్ఞాననిష్ఠయును కల సత్పురుషుల జ్ఞానము శ్రేష్ఠము. అదియే పవిత్రమైనది అని చెప్పబడును."

యజ్ఞోపవీతమునర్పించు సంస్కారము ఉపనయనము అనికూడ చెప్పబడును. ఈ ఉపనయనశబ్దమునకు రెండు అర్థములు కలవు. 1. గురువువద్దకు బాలకుని విద్యాధ్యయనము చేయించుటకు తీసికొని వెళ్ళుట, లేక వారికి అప్పగించుట. 2. మరియొకకన్ను. ప్రాణుల కన్నిటికిని రెండు కళ్లు ఉండును. వానికంటె విశేషముగుకన్ను శాస్త్రజ్ఞానమను నేత్రమును పొందుట. కాళిదాసు రఘువంశమున చెప్పెను.

కామం కర్ణాన్తవిశ్రాన్తే విశాలే తస్య లోచనే ।
చక్షుష్మత్తా తు శాస్త్రేణ సూక్ష్మకార్యార్థదర్శినా॥

"పెద్దపెద్దకళ్ళు ఉన్నంతమాత్రమున ఆతడు కళ్ళుకలవాడు కాడు. సూక్ష్మకార్యార్థములను తెలుపు శాస్త్రముద్వారానే ఆతడు చక్షుష్మంతుడుగా చెప్పబడును." మరియు

సర్వస్య లోచనం శాస్త్రం యస్య నాస్త్యన్ధ ఏవ సః ।

"శాస్త్రజ్ఞానమను కన్ను లేనివాడు కళ్ళుఉన్నను గ్రుడ్డివాడే." అని చెప్పబడెను ఈవిధముగా వేదశాస్త్రాధ్యయనాధికార సూచకముగా యజ్ఞోపవీతము గుర్తించబడినది.

## జపించదగిన శ్రేష్ఠమంత్రము.

పె. వి. :—జపించదగిన మంత్రములలో శ్రేష్ఠమయినది ఏది?

స్వా. ప్ర. :—"సావిత్ర్యాస్తు పరం నాస్తి"

గాయత్రికంటె మించిన మంత్రము లేదు. కావుననే బ్రాహ్మణులు గాయత్రినే ముఖ్యమంత్రముగా గ్రహించిరి.

## ప్రణవమంత్రాధికారము

పె. వి. :—అయిన ప్రణవమంత్రమును జపించుటలో దోషమేమైన కలదా?

స్వా. ప్ర. :—గృహస్థులు ఈమంత్రమును జపించరాదు. కామినీకనకములను త్యజించిన సన్యాసులకే దీనియందు అధికారము కలదు.

పె. వి. :— నేటి సన్యాసులు ధనము బాగుగా ఆర్జించుచున్నారు. వారికి ప్రణవాధికారము ఎట్లు కలదు?

స్వా. ప్ర. :— ధనార్జనచేయు సన్యాసులకు ధర్మముతో సంబంధము లేదు. కావున వారిని ఉదాహరణగా తీసికొనరాదు.

పె. వి. :— గృహస్థులు కామినీకనకములను త్యజించి ఏకాంతమున కూర్చుండినచో అధికారము కలదా?

స్వా. ప్ర. :—అట్టివారికి కలదు. ఏలనన దీనికి ఆశ్రమముతో సంబంధము లేదు. త్యాగముతో సంబంధము కలదు. మాయికము లగు ధనాదిపదార్థములను త్యజించి ఐకాంతికమగు వానప్రస్థజీవితమును నిర్వహించువారికి అధికారము కలదు. ఏకారణము చేతనైన సంపూర్ణత్యాగము చేయలేనివారు అజపామంత్రమును జపించవచ్చును. "సోఽహమ్"అనునది అజపామంత్రము.

## సోఽహమ్.

"సోఽహమ్"నందు రెండు శబ్దములు కలవు. "సః" అను శబ్దమునకు అర్థము అతడు అనగా బ్రహ్మము. "అహమ్"అను శబ్దమునకు "నేను" అని అర్థము. ఆ రెండుశబ్దములకును సామానాధికరణ్యము కలదు. కావున ఆ రెండును బ్రహ్మము, ఆత్మ. ఈ రెండింటియొక్కయును అనగా జీవబ్రహ్మముల రెండింటియొక్కయు ఏకత్వమును తెలుపును.

## "సోఽహమ్" జపవిధి.

శ్వాసను లోపలికి తీసికొనుట పూరకము. శ్రద్ధగా పరికించు సాధకుడు శ్వాసను లోపలికి తీసికొనునప్పుడు, అనగా పూరకమును ఆచరించుసమయమున "సో" అను ధ్వని వచ్చును. అటులనే శ్వాసను విడచుసమయమున— అనగా రేచకమునందు "హమ్" అను ధ్వని కలుగును. పూరకమునందలి చిత్తవృత్తితో దీనిని కలిపినచో సాధకునకు అయత్నపూర్వకముగా "సోఽహమ్" అను ధ్వని అనుభూతమగును. కావున అనేకమంది ప్రారంభావస్థయందలి సాధకులకు ప్రణవజపముకంటె "సోఽహమ్" జపము ఎంతయో సులభము. చిత్తవృత్తిని అపుటకు ఈ "సోఽహమ్" జపమును ఉపయోగించెదరు.

ధ్యానముచేయు సామర్థ్యము లేనివారికి ఇది ఎంతయో ఉపయోగము. అంతియేకాదు. "సోఽహమ్" జపము చేయుటచే వేదోక్తమగు ప్రణవ జపము దానంతట అదియే జరుగును. శాస్త్రములు చెప్పుచున్నవి:-

సకారం చ హకారం చ లోపయిత్వా ప్రయోజయేత్ ।
సంధిం చ పూర్వరూపాఖ్యం తతోఽసౌ ప్రణవో భవేత్ ॥

"సోఽహమ్"నందలి సకార హకారములను లోపింపజేసి, పూర్వరూపమను ఏకాదేశసంధి చేసినచో "సోఽహమ్" అనునది ప్రణవమగు "ఓమ్" అగును.

"సోఽహమ్"జపము శ్రేష్ఠమని తెలిసికొని అర్థమును భావించు కొనుచు జపించినచో మలదోషనివృత్తి యగును. దేవానుగ్రహము. కలుగును. అనగా నిర్వికల్పసమాధివరకు చేరుటకు ఇది సాధనము. ఈ "సోఽహమ్"నకు సంబంధించిన దృష్టాంతము ఒకటి కలదు.

ఎన్నియో పనులతోను, చిక్కులతోను సతమతమగుచున్న మనుష్యుడు ఒకడు ఒక మహాపురుషుని సమీపించి ఇట్లు ప్రార్థించెను. "స్వామీ! నాకు ఉన్న ఈచిక్కులు అన్నియును తప్పిపోయినచో నాకు దేవునియందు మనస్సు లగ్నముచేయు నవకాశము కలుగును. దయతో నాకు అట్టిమార్గమును ఉపదేశింపుడు." ఆమహాత్ముడు పలి కెను. "కొంతకాలము వినియోగింపవలసివచ్చును." అతడు "సరే" అనెను. మహాత్ముడు చెప్పెను. "ఈమంత్రమును ఇచ్చుచున్నాను. నలుబదిదినములు జపించుము. ఆనాడు నీవద్దకు ఒక భేతాళుడు వచ్చును. ఆతనికి నీపనులును, చిక్కులును అప్పగించి నీమనస్సును దేవునియందు లగ్నము చేయుము."

మహాత్ముడు చెప్పినట్లు 40 రోజులు సాధనచేయగా భేతా ళుడు ఎదుట హాజరయ్యెను. ఆతనికి పనులు పురమాయించగా "మీరు చెప్పుపనులను చేసెదను. కాని పనిలేని సమయము సం ప్రాప్తమగుచో మరి మిమ్మాచెంతనుండను"- అని భేతాళుడు నుడి వెను. 'సరే' అని పనులు చెప్పసాగెను. భేతాళుడు శరవేగమున

పూర్తిచేయుట చూచి ఆమనుష్యుడు మహాత్మునిచెంతకు పరుగిడి పని చెప్పలేనిచో భేతాళుడు వెళ్లిపోవునట అని చెప్పెను. అంతట మహాత్ముడు "నీకు చెప్పుటకు పనులు లేనిచో ఒక పెద్దస్తంభమును పాతించి దానిని ఎక్కుచు దిగుచు ఉండమని చెప్పుము." అని ఉపాయము చెప్పెను. ఆమనుష్యు డట్లుచేయగా భేతాళుడు అలసిపోయెను. "స్వామీ! పనిలేనిచో ఊరక కూర్చొనెదను. నాకు ఈ ఈస్తంభమును ఎక్కుచు దిగుచు ఉండమని ఆజ్ఞాపింపకుడు" అని ప్రార్థించెను. ఆమనుష్యుడు 'సరే' అని భేతాళుని తన అదుపులో నుంచుకొనెను.

మనస్సును ఆభేతాళునివలె "సోఽహమ్" అను స్తంభమును ఎక్కుచు దిగుచు ఉండునట్లు చేసిన అది అలసిపోయి చాంచల్యమును విడనాడి మన వశమునం దుండును. "సోఽహమ్" (అజపాజపము) సహజముగా పూరకరేచకములద్వారా జరుగుచునే యున్నది. దానితో చిత్తవృత్తిని అనుసరింపజేసినచో సంకల్పవికల్పములు అంత మొంది మనస్సు వశపడును.

కాళాభాయి స్వామి(శ్రీ)ప్రకాశానందులవారిని తమగ్రామము జేతపురమునకు దయచేయ ప్రార్థించగా జూనాగఢము వెళ్ళి తిరుగుదలలో వచ్చెదనని చెప్పిరి. మాగ్రామమునందు తమకు వసతులను కలుగజేయుదునని కాళాభాయి నుడివెను.

స్వా. ప్ర. :—సౌభాగ్యవతి ఒకావిడ ఒకవిధవకు నమస్కారము చేయగా 'నావలె వర్ధిల్లుము' అని ఆశీర్వదించెనట. అదేవిధముగా అరణ్యమున ఉన్న నన్ను గ్రామసమీపమునందున్న సత్రమునకు తీసికొనివచ్చిరి. ఇప్పుడు కాళాభాయి గ్రామములోపలికే తీసికొనివెళ్లునట. ఈవిధముగా నన్ను తిరిగి గృహస్థాశ్రమములోనికి రప్పించుచున్నారా?

కాళాభాయి:—స్వామివారికి జగత్తు అనిన భయపడవలసిన సమయము గడచిపోయినది. ఇప్పుడది యెందులకు?

## బ్రహ్మస్థితియందున్నవానికి భయ మెందుకు ?

స్వా. ని.:—బ్రహ్మస్థితునకు జనులనుండికాని పదార్థముల నుండికాని భయముండదు. తీవ్రవైరాగ్యశీలునకు పదార్థముల నుండి భయముండదు. కాని "అహిరివ గణాద్భీతః" సర్పము జనసమూహమునుండి భయపడునట్లు ఆతడు జనసమూహమునుండి భయపడును. తన యోగాభ్యాసమునకు అంతరాయము కలుగుటయే ఇందుకు కారణము. మందవైరాగ్యము కలవాడు పదార్థములనుండి కూడా భయపడును.

స్వా॥ ప్ర॥ :—నేను అట్టివాడనే. వివేకముద్వారా పూర్ణ వైరాగ్యము ఇంకను నాకు కలుగలేదు. నామనస్సును నమ్మలేకున్నాను. ఈదృష్టాంతము చూడుడు.

ఒకభక్తుడు నిత్యము నదికివెళ్లి స్నానము చేసెడివాడు. ఒక గణిక యింటిగుండా వెళ్ళవలసివచ్చెను. ఆమె 'తమరు పురుషులా? స్త్రీయా?'' అని ప్రశ్నించుచుండెను. సమాధానమియ్యకుండా తల వంచుకొని పోవుచుండెడివాడు. ఇట్లు కొన్నిసంవత్సరములు గడువగా ఆతనికి మృత్యుసమయము ఆసన్నమయ్యెను. ఆగణికను రప్పించి "సోదరీ! నేడు నీప్రశ్నకు గుండెలుమీద చెయ్యివేసి సమాధానము చెప్పుచున్నాను. 'నేను పురుషుడనే.' ఇంతవరకు నామనస్సుపై నమ్మకము లేక చెప్పనైతిని. ఇంద్రియములను జయించినవాడే పురుషుడు గదా! చనిపోవుచున్ననాకు ఇక భయమేల?'' అని భక్తుడు చెప్పెనట.

స్వా. ని. :— ఈదృష్టాంతము జిజ్ఞాసువులకుగాని తమకు కాదు. పాములవాడు విషపుకోరలను తీసివేసి జనులయెదుట పామును ఆడించును. అది యెంత బుసకొట్టినను, ముందుదంతములతో కప్పలను పట్టినను దానినుండి భయపడవలసిన అవసరము లేదు. అట్లే

అంతఃకరణముయొక్క రాజసతామసవృత్తులను సమాధిద్వారా నివృత్తినొందించిన తరువాత భయము ఉండదు.

స్వా. ప్రి. :— ప్రభూ! ఇది జ్ఞానుల లక్షణము. ఇంకా నేను జిజ్ఞాసుదశకుకూడా రాలేదు. నాకాయుపమానము తగదు.

పిమ్మట స్వామిప్రకాశానందులవారు ప్రొ॥ జోషీ మున్నగువారితో జూనాగఢము బయలుదేరగా, కాళాభాయి తిరుగుదలలో జేతపురము దయచేసి తమవంటి సంతుల పాదరజస్సుచే మాగ్రామమును పవిత్రింపజేయుడని కోరెను.

## సంతుల లక్షణము.

స్వా. ప్ర. :— బొంతకట్టుకొని చేత భిక్షాపాత్రమును ధరించినంతమాత్రమున సంతు కానేరడు. తీర్థాటనము, కఠోరతపము, వనవాసము, చక్కని తిలకధారణము, అక్షమాలాగ్రహణము— వీటివల్ల సంతు కానేరడు. తుకారాము నుడివినట్లు మూలవస్తువగు దేహాభిమానమును త్యజించనంతవరకు ఎవడును సంతు కానేరడు. ప్రభువుకు దూరముగనే ఉండును. ఇందుకొక దృష్టాంతము కలదు.

ఒక పాకీవాడు మురికిబట్టలతో మలపుగంపను నెత్తిమీద పెట్టుకొని మహోత్సాహముతో రాజుగారిని దర్శించుటకు బయలుదేరెను. దారిలో అందరును వేళాకోళము చేయుచుండిరి. చివరకు రాజద్వారమునకు చేరగా ద్వారపాలకులు తరిమివేసిరి. ఇది చూచి ఒకడు 'నాయనా! రాజదర్శనము కావాలంటే ఆగంపను పారవేసి స్నానాదులచే పరిశుద్ధుడవై సభ్యవేషముతో రమ్ము. నీకప్పుడు రాజదర్శన మగును' అని చెప్పెను. అంతట ఆపాకీవాడు అట్లాచరించి రాజదర్శనము చేసెను. అటులనే స్థూలసూక్ష్మకారణశరీరములనెడు మూడింటినుండియు యోగబలమున దేహాభిమానమును పోగొట్టనంతవరకు 'నేను సాక్షిని' అని తనస్వరూపము తెలియనంతవరకును పరమాత్మని దర్శనము చేయుటకు ఎవడును అర్హుడు కాడు.

పిమ్మట స్వామివారు జూనాగఢమునకు బయలుదేరి వెళ్ళి

—o—